క్లుప్తంగా

శనగ విత్తనాల కోసం రిజిస్టర్ చేయించుకోవాలి

గిద్దలూరు రూరల్: మండలంలోని రైతులు రైతుసేవా కేంద్రాలల్లో శనగ విత్తనాల కోసం ఈ నెల 13 వ తేదీ నుంచి రిజిస్టర్ చేయించుకునే అవకాశం కల్పిస్తున్నామని స్థానిక ఏఓ విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 శాతం సబ్సిడీతో బయోమెట్రిక్ విధానంలో శనగ విత్తనాలు రిజిస్టర్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్ తీసుకుని రావాలని సూచించారు. ఒక్కో ఎకరానికి 40 కిలోల చొప్పున 5 ఎకరాల వరకు విత్తనాలు పంపిణీ చేస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీజే సౌండు బాక్సులు వాడరాదు: సీఐ

అర్ధవీడు: మండల పరిధిలో శుభకార్యాలకు, తిరునాళ్లకు, ఏదైనా ఇతర కార్యక్రమాలకు డీజేలకు అనుమతి లేదని సీఐ కే.మల్లిఖార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు పొందిన వారు మైకు లేదా సౌండు బాక్సులు పరిమిత సంఖ్యలో మాత్రమే వాడుతూ, పరిమిత సౌండు మించకుండా ఉండాలని తెలిపారు.

12న జేవీవీ చర్చావేదిక

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో ఈ నెల 12 వ తేదీ ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గిద్దలూరు అభివృద్ధిపై చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు జె.వి.వి నాయకులు పి.స్వరూపారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగొండ పూర్తయ్యేనా, అన్నదాతకు ఆసరా ఏదీ అనే అంశం పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సీతారామారావు

గిద్దలూరు రూరల్: ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలని స్థానిక ఎంపీడీఓ సీతారామారావు అన్నారు. మండలంలోని పాదలకుంటపల్లెలో శుక్రవారం శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఉయ్యాలవాడ, సంజీవరాయుడుపేటలోని సచివాలయాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయంలోని రికార్డులతో పాటుగా సిబ్బంది హాజరును పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని రిటైర్డ్ ఎంఈఓ సీహెచ్ మాధవకృష్ణారావు అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో శుక్రవారం రూ.10 వేలతో మొక్కలు, ట్రీగార్డ్‌లను రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇమ్మడి తిరుపతయ్య అందించిన ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మన్నెం శ్రీదేవి, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఓ గురువరకుమార్

బేస్తవారిపేట: జాతీయ ఉపాధి హామీ పథకం కార్డు కలిగిన ప్రతి వేతనదారుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్ అన్నారు. మండలంలోని సోమవారిపేటలో శుక్రవారం కూలీలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకేవైసీ చేయించుకోని జాబ్‌కార్డులు ఇన్‌యాక్టివ్‌లోకి వెళ్తాయన్నారు. మస్టర్‌లోకి పేరు రాకపోవడంతో పని కల్పించలేమన్నారు. పంచాయతీ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్‌లో ఆధార్ అనుసంధానం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో టీఏ రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు చిన్నపాటి మరమ్మతుల కారణంగా బేస్తవారిపేటలో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సన్యాసిరావు తెలిపారు. బేస్తవారిపేటలోని ఎంపీడీఓ కార్యాలయం వీధి, వాల్మీకి నగర్, టీచర్స్‌కాలనీ, గురువారెడ్డి రైస్‌మిల్లు ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వెలుగొండ ప్రాజెక్టును
వెంటనే పూర్తి చేయాలి

- రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు



జెండాను ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

తర్లుపాడు: వెనుకబడిన పశ్చిమ ప్రకాశం వరప్రదాయని వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి నిర్వాసితులకు ప్యాకేజీ అందించాలని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం తర్లుపాడులో రైతు సంఘం మూడో మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతుల సమస్యలపై ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం వెంటనే వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు పండించిన పంటలకు కనీస గిట్టుబాటు ధర కూడా లభించడం లేదని విచారం వ్యక్తం చేశారు. పత్తిరైతుల కోసం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని రైతులు తమ భూముల విషయంలో ఆన్‌లైన్ సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, కూటమి ప్రభుత్వం స్పందించకపోతే రాజీలేని పోరాటాలకు రైతు సంఘం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. రైతు సంఘ మండల నూతన కన్వీనర్‌గా ఏరువ పాపిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకుని నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రైతు సంఘ జిల్లా నాయకులు డి.సోమయ్య, ఆర్.రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి బాల గురవయ్య పాల్గొన్నారు.



హోటల్లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి

ఎక్సైజ్ అధికారుల విస్తృత తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

కంభం: కంభంలో జోరుగా గంజాయి, మట్కా దందా జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం సాక్షి దిన పత్రికలో 'పట్టణంలో గంజాయి, మట్కా దందా' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి పట్టణంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు దుకాణాలు, హోటల్స్, అర్బన్ కాలనీ, నక్కలగండి పరిసరాలను గాలించారు. గంజాయి తాగడం వలన కలిగే అనర్థాలపై అర్బన్ కాలనీలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. గంజాయి వినియోగం, విక్రయం చట్టరీత్యా నేరమని, అలాంటి పనులకు ఎవరైనా పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జవహర్ నవోదయలో ఎన్‌సీసీ క్యాంపు



ఎన్‌సీసీ క్యాంపునకు హాజరైన విద్యార్థులు

మార్కాపురం టౌన్: మార్కాపురం-ఒంగోలు రోడ్డులోని కలుజువ్వలపాడు సమీపంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయలో ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ ఎన్‌సీసీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీకాంత్ తెలిపారు. ఒంగోలు బెటాలియన్ 34 ఏ ఆధ్వర్యంలో మోహన్, పుష్పరాజ్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉదయాన్నే సైనిక తరహాలో శిక్షణ ఉంటుందని, వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. క్యాంపులో గుంటూరు జిల్లాకు చెందిన విద్యార్థులు కూడా పాల్గొంటున్నట్లు చెప్పారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



తలకు తీవ్రగాయాలైన కేశవరెడ్డి

గిద్దలూరు రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లె గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం అక్కల్‌రెడ్డిపల్లెకు చెందిన స్వామిరంగారెడ్డి తన బైక్ పై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఉప్పలపాడు గ్రామానికి చెందిన కేశవరెడ్డి బైక్ రెండూ ఢీకొని ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది క్షతగాత్రులను గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తలకు తీవ్రగాయాలైన కేశవరెడ్డిని మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. స్వామిరంగారెడ్డికి కాలు విరగడంతో మెరుగైన వైద్యం కోసం ఆయన్ను నరసరావుపేటకు తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దుకాణాల్లో తూనికల శాఖ అధికారుల తనిఖీలు



వస్త్ర దుకాణంలో సోదాలు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ మొహసీన్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, మెయిన్ బజారు, రాచర్లగేటు సెంటర్ లలోని పలు వ్యాపార దుకాణాల్లో మార్కాపురానికి చెందిన తూనికల శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ షేక్ మొహసీన్ వ్యాపార దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు. వస్తువులపై ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న వాటిని గుర్తించి వాటి పై కేసులు నమోదు చేశారు. రాచర్ల రోడ్డులోని ఎరువుల షాపు, పొట్టిశ్రీరాముల వీధిలో వస్త్ర దుకాణం , కిరాణా షాపులు 3 మొత్తం 5 వ్యాపార దుకాణాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. రాచర్ల మండలంలోని చోళ్లవీడు, జె.పి.చెరువు గ్రామాల్లో కూల్‌డ్రింక్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నారని గమనించి వారి పై కేసులు నమోదు చేసినట్లు తూనికల శాఖ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యాపారం కొనసాగించాలని వ్యాపారస్తులకు సూచించారు. ఆయన వెంట సిబ్బంది నారాయణ ఉన్నారు.

వ్యవసాయంలో మెళకువలు పాటించాలి



మట్టి నమూనా కార్డులు అందజేస్తున్న అధికారులు

కొనకనమిట్ల: మట్టి పరీక్షలు ఆధారంగా వ్యవసాయంలో రైతులు మెళకువలు పాటించి లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా భూసార పరీక్ష కేంద్రం ఏఓ డి.స్వరూప అన్నారు. శుక్రవారం మండలంలోని నాగంపల్లిలో మట్టి నమూనా పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయిల్ హెల్త్ కార్డులు అనుసరించి భూముల్లో ఎరువులు వాడాలన్నారు. నీటి పరీక్షలు చేయించుకుంటే కలిగే ఉపయోగాలు రైతులకు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజ మాట్లాడుతూ జీవన ఎరువుల ప్రాధాన్యం వివరించి రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేశారు. అనంతరం వెలుగొండలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు మట్టి నమూనాలు తీసే విధానం, మట్టి సేకరణ, ప్రాముఖ్యత వంటి షయాలపై అవగాహన కలిపించారు. మండల వ్యవసాయాధికారి కై .ప్రకాస్‌రావు, టిక్నాలజీ మేనేజర్ నాగభూషణం, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఇబ్రహీం, సైన్స్ టీచర్ రామేశ్వర రెడ్డి, ఏఈఓ శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం



చర్చిని ప్రారంభిస్తున్న క్రిస్టొఫర్

మార్కాపురం టౌన్: తెలుగు బాప్టిస్టు పాలెం చర్చిని సంఘ అధ్యక్షుడు బూదాల క్రిస్టొఫర్ శుక్రవారం ప్రారంభించారు. పట్టణంలోని రాధాకృష్ణ థియేటర్ సమీపంలో తెలుగు బాప్టిస్టు చర్చిని ప్రారంభించి మాట్లాడారు. మార్కాపురం పట్టణంలో మొదటగా చర్చిని నిర్మించినట్లు పేర్కొన్నారు. ఇటీవల మొదటి అంతస్తు కూడా నిర్మించి మరో సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించామన్నారు. చర్చి కార్యదర్శి వినుకొండ విల్సన్, కోశాధికారి ఎం.శామ్యూల్ జాన్, చర్చి పాస్టర్ ఎం.జార్జిబాబు, క్రైస్తవులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

మార్కాపురం: స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద శుక్రవారం పోస్టల్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోస్టల్ ఉద్యోగుల రాష్ట్ర అసిస్టెంటు సెక్రటరీ నూనె రమణారెడ్డి మాట్లాడుతూ 2023 డిసెంబర్‌లో గ్రామీణ డాక్ సేవక్ ఆధ్వర్యంలో ఉద్యోగుల హక్కుల సాధన కోసం చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ జనరల్ సెక్రటరీ మహాదేవను ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించకూడదో నోటీసు ప్రభుత్వం జారీ చేసిందన్నారు. హక్కుల పోరాటం చేయడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. దీంతో దేశవ్యాప్తంగా శుక్రవారం పోస్టల్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారన్నారు. ఉద్యోగులకు హక్కులు ఉండవా..అని ప్రశ్నించారు. ప్రతి ఉద్యోగి తీవ్ర ఒత్తిళ్ల మధ్య ఉద్యోగం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నోటీసును వెనక్కు తీసుకోవాలన్నారు. యూనియన్ నాయకులు శంకర ప్రసాద్, రమణ, నారాయణరెడ్డి, ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉంటూ ఏదైనా సమస్య ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించి వారి సహకారం తీసుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఎస్ఐ వేమనతో కలిసి వాకర్స్‌కు పలు విషయాలపై ఆయన అవగాహన కల్పించారు. రిటైర్డ్ ఉద్యోగులు, యువకులు, విద్యార్థులకు మహిళల భద్రత కోసం రూపొందించిన యాప్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ తదితర విషయాలకు సంబంధించి అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ లింకులు, ఫోన్‌కాల్స్, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలు, వాటిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండటం మోసపోయే అవకాశం లేకుండా ఉంటుందన్నారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఎస్సై వేమన మాట్లాడుతూ మహిళల పట్ల నేరాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, రోడ్డు ప్రమాదాలు, జాగ్రత్తలు గురించి వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర నాయకులు

మార్కాపురం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్‌ఎంయూ కృషి చేస్తోందని అధ్యక్ష,కార్యదర్శులుగా ఎన్నికైన సీహెచ్ శ్రీనివాసులు, భవనం శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం డిపో ఎదురుగా ఉన్న ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఎన్‌ఎంయూ సమావేశానికి రాష్ట్ర నాయకులు వైఎస్ ప్రసాద్, జోనల్ నాయకులు ఎస్‌కే దస్తగిరి, రీజనల్ నాయకులు ఆర్.అంజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హుస్సేన్, చైర్మన్‌గా వెంకటేశ్వర్లు, గ్యారేజీ ప్రతినిధులుగా టీఎంకే రావు, బీఎస్‌ఎన్ రెడ్డి, టీవీ లక్ష్మి, పీఎస్ లక్ష్మి, శాంతకుమారిలను ఎన్నుకున్నారు. మరో యూనియన్ నుంచి వచ్చిన 5 మందికి సభ్యత్వం ఇచ్చినట్లు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



హరిబాబును సన్మానిస్తున్న అందె నాసరయ్య, నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ మున్సిపల్ వర్కర్ అవార్డు గ్రహీత టి.హరిబాబును ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అందె నాసరయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ మున్సిపల్ వర్కర్ అవార్డు రావడం అభినందనీయమన్నారు. మున్సిపల్ వర్కర్‌గా తన విధులు నిర్వహిస్తూ అందరితో మన్ననలు పొంది శభాష్ అనిపించుకున్న హరిబాబును పలువురు ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తన విధులు నిర్వహిస్తూ వర్కర్ల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారం కోసం కష్టపడుతున్న హరిబాబును అభినందించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశీం, సీపీఐ నాయకులు డి.కాశయ్య, రత్నం, ఆర్టీసీ కార్మిక నాయకుడు కేశవ పాల్గొన్నారు.

బోధనేతర విధుల బహిష్కరణ



వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

పొదిలి: బోధనేతర విధులు నిర్వహించలేమని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. శుక్రవారం బోధనేతర విధులు బహిష్కరించి ఎంఈఓకు వినతిపత్రం అందించారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ విద్యాశక్తి, జీఎస్‌టీ 2.0 లాంటి సీజనల్ కార్యక్రమాల ప్రచారం తాము నిర్వహించబోమని చెప్పారు. అనవసరమైన గూగుల్స్ షీట్లు నింపటంతో పాటు బోధనేతర కార్యక్రమాల మూలంగా ఉపాధ్యాయుల్లో బోధన ఆసక్తి క్రమేణా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణకు సంబంధించిన పనులు మాత్రమే చేస్తామని చెప్పారు. మూల్యాంకనానికి సంబంధించిన పరీక్షల నిర్వహణ చేపడతామన్నారు. కార్యక్రమంలో డివిజన్ చైర్మన్ పి.బాల వెంకటేశ్వర్లు, ఫ్యాప్టో నాయకులు బి.బుజ్జిబాబు, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, అలా వెంకటేశ్వర్లు, రామగోపాలరెడ్డి, ఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి



సూరవారిపల్లె గ్రామ సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం

కొమరోలు: గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ సేవలు అందించాలని ఎంపీడీఓ సత్యం తెలిపారు. మండలంలోని సూరవారిపల్లి, రెడ్డిచెర్ల గ్రామ సచివాలయాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో సిబ్బంది సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజు సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పశ్చిమాన గాలి, వర్షం



రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

మార్కాపురం: పశ్చిమాన పలు మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వానతో గురువారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అర్ధరాత్రి 12 గంటల నుంచి ఒంటి గంట వరకూ పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. యర్రగొండపాలెంలో అత్యధికంగా 74 మిమీ, మార్కాపురంలో 48.4 మిమీ, పెద్దారవీడులో 36.8 మిమీ, తర్లుపాడులో 20.4 మిమీ, పుల్లలచెరువులో 14.6 మిమీ, దోర్నాలలో 8.6 మిమీ, గిద్దలూరులో 7.2 మిమీ, ఇంకా రాచర్ల, కంభం, బేస్తవారపేట, కొమరోలు మండలాల్లో వర్షం కురిసినట్లు డివిజన్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ చెంచిరెడ్డి తెలిపారు. సగటున 18.2 మిమీ వర్షం కురిసినట్లు పేర్కొన్నారు. ఈ వర్షం పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలకు ఉపయోగపడుతుందని పలువురు రైతులు తెలిపారు.

గొట్లగట్టులో ట్రాఫిక్

- ఎక్కడికక్కడ ఆటోలు, బైకుల పార్కింగ్
- ఇరుకుగా మారిన మెయిన్ రోడ్డు



బస్టాండ్ సెంటర్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్

కొనకనమిట్ల: ఒంగోలు-గిద్దలూరు రహదారి మండలంలోని మేజర్ పంచాయతీ గొట్లగట్టులో బస్టాండ్ సెంటర్‌లో వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బస్టాండ్ సెంటర్‌తో పాటు గ్రామంలోకి వచ్చే రహదారిలో ఎక్కడ పడితే అక్కడ ఆటోలు, మోటార్ సైకిళ్ల పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో వాహన రాకపోకలకు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. ఇటీవల బస్టాండ్ సెంటర్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అందులో భాగంగా ఒక వైపు సీసీ రోడ్డు వేయడంతో రెండో వైపు మార్జిన్ సక్రమంగా లేక పోవటం, రోడ్డు గుంతలు పడటం, రెండువైపులా నుంచి వచ్చే వాహనాలు వెళ్లాంటే ఇబ్బందిగా మారింది. రోడ్డులోనే ఆటోలు, బైక్‌లు నిలపటంతో వాహనాలు ఎదురుపడినప్పుడు ట్రాఫిక్ జటిలమవుతుంది. దీంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రహదారి విస్తరణ పనులు పూర్తి చేసి రెండు వైపులా మార్జిన్‌లు సరిచేస్తేగానీ ట్రాఫిక్ సమస్య తీరదు. ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.